# ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

## నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి కనకదుర్గ మాత ఆలయానికి సద్గుణరెడ్డి–సత్యనారాయణ దంపతుల విరాళం



**దశ ఓయూ:** నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ఆవరణలోని శ్రీ కనకదుర్గ మాత ఆలయ అభివృద్ధికి ఆసుపత్రి విశ్రాంత కార్యాలయ సూపరింటెండెంట్ జై సద్గుణరెడ్డి-సత్యనారాయణ దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు స్వీకరించి దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాదగిరి, అధ్యక్షుడు ఓం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఆలయ సలహాదారులు కోలా వాసు ,రవీందర్, కోశాధికారి నాగరాజు, సంయుక్త కార్యదర్శి సత్యనా రాయణ, సలహాదారులు కోలా వాసు, పి. రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. సురేష్, కమిటీ సభ్యులు రమేష్, దేవాలయ నిర్మాణ శిల్పి బండారు కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

# కేసారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలి

## కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన లబ్ధిదారుల సంఘం అధ్యక్షురాలు ఆశ



**దశ సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కేసారం లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు వెంటనే నల్ల కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సంఘం అధ్యక్షురాలు ఆశ సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ను కలిసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ వద్దకు మిషన్ భగీరథ పైప్ లైన్ వచ్చి ఉన్నదని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కనెక్షన్లు ఇస్తే నీటి సమస్య ఉండదు అన్నారు. లేకపోవడంతో తాము ఇండ్లలోకి రాలేకపోతున్నామని వెంటనే నల్ల కనెక్షన్లు ఇచ్చి డబుల్ బెడ్ రూమ్లను మాకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఫీ, రవి, రేణుక, సుశాంత్, వెంకన్న, కృష్ణ, సైదమ్మ, సంగీత, మంజు నరేష్, మస్తాన్, అనసూయ, మౌనిక, సునీత, రహిమ, సాత్విక, కౌసల్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీ..

## ఆగస్టు 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో పోలీస్ శాఖలో భారీ ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (TSLPRB) విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ కోసం మొత్తం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బోర్డు సూచించింది.

ఈ నియామక ప్రక్రియలో అత్యధికంగా కానిస్టేబుల్ స్థాయి పోస్టులే ఉన్నాయి. మొత్తం ఖాళీల్లో దాదాపు 7 వేల పోస్టులు కానిస్టేబుల్ కేటగిరీకే చెందినవిగా అధికారులు తెలిపారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### విడుదలైన పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి..

| | |
|---|---|
| సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) – | 148 |
| ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) ఎస్ఐ – | 14 |
| టీజీఎస్‌పీ ఆర్మ్డ్ రిజర్వ్ ఎస్ఐ – | 12 |
| ఎన్ఆర్ఈఆర్ సీపీఎల్ ఎస్ఐ – | 3 |
| ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్ఐ – | 23 |
| సివిల్ కానిస్టేబుల్ – | 3,697 |
| ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ – | 1,052 |
| ఎన్ఆర్ఈఆర్ సీపీఎల్ కానిస్టేబుల్ – | 24 |
| కానిస్టేబుల్ (డ్రైవర్) – | 20 |
| కానిస్టేబుల్ (మెకానిక్) – | 7 |

మిగతా విభాగాలకు సంబంధించిన పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్షల షెడ్యూల్‌ను నోటిఫికేషన్‌లో పొందుపరిచినట్లు బోర్డు వెల్లడించింది. నిరుద్యోగ యువత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# శ్రావ్య ఆత్మహత్యాయత్నానికి కాలేజీ యాజమాన్యమే కారణం: సీపీఐ ఆరోపణ

## విద్యార్థినికి న్యాయం చేయాలని నేతాజీ నర్సింగ్ కాలేజీ ఎదుట ఆందోళన





**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** నేతాజీ నర్సింగ్ కాలేజీలో విద్యార్థిని శ్రావ్య ఆత్మహత్యాయత్నానికి కాలేజీ యాజమాన్యం వేధింపులే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ఆరోపించారు. శ్రావ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం పెద్ద అంబర్‌పేటలోని నేతాజీ నర్సింగ్ కాలేజీ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ, అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు సరైన అనుమతులు, కనీస వసతులు, అర్హత కలిగిన అధ్యాపకులు లేకుండానే నడుస్తున్నాయని, నేతాజీ నర్సింగ్ కాలేజీ కూడా అదే తరహాలో నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని కోరిన శ్రావ్యను కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు నిరంతరం వేధించడంతో జులై 12న కళాశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు తీవ్రంగా విరిగిపోయాయని తెలిపారు. ఇప్పటికీ కాలేజీ యాజమాన్యం విద్యార్థినిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కుటుంబ సభ్యులను ఫోన్‌ల ద్వారా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసిన యాజమాన్యం కనీస మానవత్వంతోనైనా వైద్య సహాయం అందించకపోవడం బాధాకరమని మండిపడ్డారు.

తక్షణమే కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు జోక్యం చేసుకుని నేతాజీ నర్సింగ్ కాలేజీ అనుమతులను రద్దు చేసి, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తీవ్రంగా గాయపడిన శ్రావ్యకు మెరుగైన వైద్యం అందించి, ఆమెకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, మహిళా కో కన్వీనర్ పార్వతి, నిఖిల్, ఏఐవైఎఫ్ అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షులు శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, సహాయ కార్యదర్శి చంటి, కోశాధికారి అశోక్, సత్యం, వెంకట దుర్గ ప్రసాద్, చందు,అరవింద్, సీపీఐ మెట్ మండల కార్యవర్గ సభ్యులు పేరాల గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి మొక్కల పంపిణీ..

## పచ్చదనం పెంపుపై చల్లూర్ గ్రామపంచాయతీ ప్రత్యేక కార్యక్రమం



**దశ, యాదాద్రి భువనగిరి:** పచ్చదనం పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబాన్ని భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం చల్లూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య ప్రతి కుటుంబానికి మూడు మొక్కలను అందజేసి, వాటిని తప్పనిసరిగా నాటి సంరక్షించాలని గ్రామస్థులకు సూచించారు. మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని చెట్లుగా పెంచే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని మరింత హరితమయంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం తమవంతు సహకారం అందించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకమని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు పెరిగితే గ్రామం మరింత ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ మహేశ్వరం మల్లేష్, ఆరుకల గాలిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి గండికోట మహేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా: సీతక్క



**దశ, హైదరాబాద్:** తల్లిపాలే శిశువుకు తొలి టీకా అని, అది ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈనెల 7వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని శనివారం ఒక ప్రకటన అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాలపై అంగన్‌వాడీ టీచర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు.. ఉపాధ్యాయులు, హెల్పర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్యారోగ్య సిబ్బంది సమన్వయంతో ముందుసాగాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

# ఇంటర్ అడ్మిషన్ల గడువు 15 వరకు పొడిగింపు

**దశ, హైదరాబాద్:** ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల గడువును ఇంటర్‌బోర్డు మరోసారి పొడిగించింది. ఈ నెల 15 వరకు అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు అడ్మిషన్లు పొందనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు.

# ఆరుతడి పంటల సాగుతో నష్టాలకు చెక్



**దశ, చౌటుప్పల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ వానాకాలంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి పల్లె వెంకటేశం సూచించారు. శనివారం పెద్ద కొండూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మండలంలో వర్షపాతం తక్కువగా ఉన్నందున స్వల్పకాలిక పంటలైన కందులు, మినుములు, కూరగాయల సాగు చేపట్టడం రైతులకు లాభదాయకమని తెలిపారు. రైతులు సకాలంలో విత్తనాలు విత్తి, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్న శాస్త్రీయ విధానాలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండెబోయిన శిరీష యాదవ్, ఉపసర్పంచ్ పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కోసం ప్రత్యర్థిపై కుట్ర

## గంజాయి కేసులో ఇరికించిన కానిస్టేబుల్ అరెస్ట్!

**దశ హుజురాబాద్:**



మాదకద్రవ్యాల నియంత్రణ విభాగంలో పనిచేస్తూ స్నేహితుని కోసం అతని ప్రత్యర్థి పై అక్రమ కేసు పెట్టేందుకు గంజాయి నిల్వచేసిన ఈగల్ టీం కానిస్టేబుల్ ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుని వివరాలను కొత్తపెల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడించారు. కరీంనగర్ మండలం సీతారాంపూర్ లో నివాసముంటున్న ఈగల్ టీం కానిస్టేబుల్ మెడబోయిన నాగరాజు వద్ద గంజాయి నిల్వ ఉందన్న సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 370 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును విచారించగా చిగురుమామిడి మండలం కొండాపూర్ కు చెందిన శ్రీనివాస్ కు నాగరాజుకు పరిచయం ఉంది. అదే గ్రామంలో శ్రీనివాస్ కు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తులకు మధ్య భూతగాదాలు ఉండడంతో ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించిన కొలిక్కి రాకపోవడంతో అతన్ని కేసులో ఇరికించాలనే ఉద్దేశంతో నాగరాజు శ్రీనివాసులు కలిసి పథకం పన్నారు. స్నేహితుని కోసం కానిస్టేబుల్ నాగరాజు వరంగల్ నుంచి గంజాయి తెప్పించి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఎరువుల దుకాణంలో పెట్టాడు. తిరిగి పోలీసులకు సమాచారం అందించి చిరుమామిడి పోలీస్ స్టేషన్లో కేసు నమోదయ్యేలా చేసి కటకటాల పాలు చేశారు. వరంగల్ నుంచి తెప్పించిన గంజాయిలో కిలో గంజాయి శ్రీనివాస్ రెడ్డి దగ్గర దొరికినట్లు చూపించగా మిగిలిన 3 70 గ్రాముల గంజాయిని తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నాగరాజు ఇంట్లో దాడులు నిర్వహించి గంజాయి తోపాటు నాలుగు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఏసీబీ వెంట కొత్తపల్లి ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ పాల్గొన్నారు.

# దేవరకొండ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



**దశ, నల్గొండ:** నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, పాదచారులకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ బి. వంశీ కృష్ణ ఆదేశాల మేరకు దేవరకొండ రోడ్డులో శనివారం భారీ ఎత్తున ఆక్రమణల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ కార్యాలయం నుంచి దుప్పలపల్లి రోడ్డు వరకు ప్రధాన రహదారిపై చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో సుమారు 46 ఆక్రమణలను తొలగించడంతో పాటు మూడు ప్రధాన జంక్షన్లను పూర్తిగా క్లియర్ చేశారు. రహదారులు, కూడళ్లు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు, తాత్కాలిక ఆక్రమణలను తొలగించి ప్రజల రాకపోకలకు అనువుగా మార్చారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల వెంట ఉన్న దుకాణాలు,

### 46 అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ చర్యలు

వాణిజ్య సంస్థల యజమానులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. షెడ్లు, సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు, డబ్బా బంకులు, ప్రకటన బోర్డులు, వస్తువుల ప్రదర్శనలు తదితరాలను ఫుట్‌పాత్‌లు లేదా రహదారులపై ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు.

ఫుట్‌పాత్‌లు పూర్తిగా పాదచారుల వినియోగం కోసమేనని, వాటిని ఆక్రమించడం వల్ల ప్రజలు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ట్రాఫిక్ సౌలభ్యం, ప్రజల భద్రత, నగర క్రమబద్ధీకరణ కోసం ఇటువంటి ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

వ్యాపారులు తమ ఆక్రమణలను స్వచ్ఛందంగా వెంటనే తొలగించుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఆక్రమణలను తొలగించడంతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం జరిమానాలు, అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. నగరంలోని అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఇలాంటి ప్రత్యేక ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు, వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి. వంశీ కృష్ణ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌కు ఆగస్టు 10 వరకు గడువు

### నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్




**దశ, రంగారెడ్డి:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.

శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న నవీన్ కుమార్‌కు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి స్వాగతం పలికారు. సమావేశంలో ఇప్పటివరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించిన ఆయన, జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు.

ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫొటోలు, పత్రాల అప్‌లోడ్ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పనుల నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ప్రస్తుతం 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, డూప్లికేట్, అనామలీస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.

ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడంతో ప్రతి పెండింగ్ కేసును క్షుణ్ణంగా పరిశీలించి, బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి సంయుక్తంగా ధృవీకరణ చేపడతామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగిస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగర, బొంగులూరు, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, బీఎల్‌వోలతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు.

## యూకేలో తెలుగు పేజెంట్ ఘన విజయం

### హైదరాబాద్‌లో విజేతల మీడియా ముఖాముఖి




**దశ, హైదరాబాద్ :** యునైటెడ్ కింగ్‌డమ్‌లో తొలిసారిగా నిర్వహించిన తెలుగు పేజెంట్ యూకే-2026 విజేతలు శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో ముఖాముఖి నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని గ్రీజ్ మంకీ రెస్టారెంట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజేతలు తమ అనుభవాలను పంచుకున్నారు. దేశీ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు ప్రీతి పులిపాక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పేజెంట్ యూకేలోని తెలుగు ప్రవాసుల్లో విశేష ఆదరణ పొందింది. ప్రతిభ, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, తెలుగు సంస్కృతిపై గర్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. జూలై 11, 12 తేదీల్లో లండన్‌లో నిర్వహించిన తొలి ఎడిషన్‌లో మిస్టర్, మిస్, మిసెస్, టీన్స్, కిడ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కిడ్స్ విభాగంలో ఈతన్ యండ్రపాటి, షానయ పల్లెర్ల, టీన్స్ విభాగంలో క్రిస్సీ యండ్రపాటి, శ్లోక కర్ర, మిస్ విభాగంలో సంజనా పప్పు, మిసెస్ విభాగంలో సౌజన్య మిరుద్దోడి పాల్గొన్నారు. అంతర్జాతీయ వేదికపై తెలుగు సంస్కృతికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని వారు తెలిపారు. కార్యక్రమంలో యూకేలో తొలిసారిగా తెలుగు సినిమా ప్రచారాన్ని పేజెంట్ వేదికపై నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. త్వరలో విడుదల కానున్న 'ఎపిక్' తెలుగు సినిమా ప్రచారాన్ని నిర్వహించడం ద్వారా భారత్-యూకే మధ్య సాంస్కృతిక బంధాలు మరింత బలపడ్డాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## శాంతించిన ప్రాణహిత

**దశ, హైదరాబాద్**

కర్ణాటక, మహారాష్ట్రతోపాటు, రాష్ట్రంలోనూ ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శుక్రవారం వరకు ఉప్పొంగిన ప్రాణహిత శనివారం శాంతించింది. మేడిగడ్డ వద్ద 5.66 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, సమ్మక్కసాగర్ వద్ద 7.58 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. కృష్ణమ్మలో వరద క్రమంగా పెరుగుతున్నది. జూరాలకు 1.78 లక్ష క్యూసెక్కులు వస్తుండగా, శ్రీశైలం ప్రాజెక్టుకు 1.28 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఉప్పొంగిన పెన్‌గంగ: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మాకిడి, హుడ్కులీ, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ శనివారం ఉగ్రరూపం దాల్చడంతో తెలంగాణమహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. హుడ్కులీ లోలెవల్ వంతెన పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో మునిగిపోయింది. సిర్పూర్(టీ) హుడ్కులీ గ్రామం మీదుగా మహారాష్ట్ర (రాజురా) వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

## రీయింబర్స్‌మెంట్ ఎత్తివేస్తే రాష్ట్రం అగ్నిగుండమే

### ఎంపీ ఆర్ కృష్ణయ్య హెచ్చరిక



**దశ, వనస్థలిపురం, :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్రలను నిరసిస్తూ శనివారం ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురంలో సాగర్ హైవేపై ధర్నా నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.8వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెత్తు పోకడలతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ తీరు మారకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తేల్చిచెప్పారు.

## భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం

### 55.1 అడుగులకు నీటిమట్టం

### మూడో ప్రమాద హెచ్చరిక జారీ



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే గోదావరి నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుని శనివారం ఉదయానికి 55.1 అడుగులు నమోదు కావడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను ముమ్మరం చేసింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. భారీ వరదలతో భద్రాచలం-వెంకటాపురం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భద్రాద్రి ఏజెన్సీలోని పలు గ్రామాలు ఇతర ప్రాంతాలతో సంబంధాలు కోల్పోయాయి. ఇదిలా ఉండగా, చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపు వరద నీటితో చుట్టుముట్టబడింది. అక్కడ చిక్కుకుపోయిన లారీ డ్రైవర్లు, 46 మంది ర్యాంపు సిబ్బందిని అధికారులు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో యంత్రాలు, తెప్పల ద్వారా సురక్షితంగా బయటకు తరలించారు. ర్యాంపు సిబ్బందిని రక్షించే క్రమంలో చర్ల సీఐ రాజువర్మ ప్రయాణిస్తున్న తెప్ప వరద ప్రవాహంలో తిరగబడినా, ఆయన చాకచక్యంగా తెప్పను పట్టుకుని సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. వరద ఉద్ధృతి దృష్ట్యా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను రంగంలోకి దింపగా, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట సహా ఉన్నతాధికారులు భద్రాచలంలోనే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

వరద ప్రభావిత పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో మొత్తం 49 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గోదావరి నీటిమట్టం గురువారం అర్ధరాత్రి 29.70 అడుగుల నుంచి వేగంగా పెరిగి శుక్రవారం ఉదయం 40.20 అడుగులకు, ఉదయం 43 అడుగులకు చేరడంతో తొలి ప్రమాద హెచ్చరిక, మధ్యాహ్నం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం అర్ధరాత్రి 53.10 అడుగులు, శనివారం ఉదయానికి 55.1 అడుగులు నమోదు కావడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## మిడిల్ క్లాస్ జీవితం.. జీతం రాగానే ఖాతా ఖాళీ!




**దశ, హైదరాబాద్:** నెల మొదటి తేదీన జీతం ఖాతాలో పడుతుంది. కానీ ఆ ఆనందం కొన్ని గంటలే. ఈఎంఐలు, ఇంటి అద్దె, క్రెడిట్ కార్డు బిల్లులు, పిల్లల స్కూల్ ఫీజులు, కరెంట్, కిరాణా, పెట్రోల్ ఖర్చులు... ఒక్కొక్కటిగా చెల్లింపులు పూర్తయ్యే సరికి బ్యాంకు ఖాతా దాదాపు ఖాళీ అవుతుంది. ఇదే నేటి మిడిల్ క్లాస్ కుటుంబాల వాస్తవ పరిస్థితి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం రోజురోజుకూ పెరుగుతోంది. జీవన వ్యయం భారీగా పెరుగుతున్నా, చాలా మందికి వేతనాలు అదే స్థాయిలో పెరగకపోవడంతో నెలాఖరు వరకు ఖర్చులను సర్దుబాటు చేయడమే పెద్ద సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఓ వ్యక్తి చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "జీతం వస్తుంది... వెంటనే ఈఎంఐలు, అద్దె, బిల్లులు, స్కూల్ ఫీజులు చెల్లిస్తే చివరికి మన కోసం ఏమీ మిగలదు. ఇష్టమైనవి తినలేం, కొనాలనుకున్నవి కొనలేం. జీవితమంతా బాధ్యతల మధ్యనే గడిచిపోతుంది" అంటూ ఆయన చెప్పిన మాటలు మధ్యతరగతి కుటుంబాల మనోవేదనను ప్రతిబింబిస్తున్నాయని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఆ వీడియోకు వేలాది మంది స్పందిస్తూ "ఇది మా జీవితమే", "మా మనసులో ఉన్న బాధను చెప్పేశారు", "జీతం పెరగడం లేదు.. ఖర్చులు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి" అంటూ కామెంట్లు చేస్తున్నారు.

నగరంలో ఇంటి అద్దెలు, విద్యా ఖర్చులు, వైద్య వ్యయం, నిత్యావసర వస్తువుల ధరలు, రవాణా ఖర్చులు గణనీయంగా పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పొదుపు చేయడం దాదాపు అసాధ్యంగా మారింది. భవిష్యత్ కోసం ఆదా చేయాలన్న ఆలోచన ఉన్నా, ప్రస్తుత అవసరాలకే జీతం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెళ్లి, పిల్లల చదువు, కుటుంబ బాధ్యతలు, రుణాల భారం... ఇవన్నీ కలిసి మధ్యతరగతి జీవితాన్ని ఆర్థిక ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. అయినప్పటికీ కుటుంబం కోసం తమ కోరికలను పక్కన పెట్టి, కష్టాలను మౌనంగా భరిస్తూ ముందుకు సాగడం మిడిల్ క్లాస్ జీవితంలో నిత్యకృత్యంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.